లక్ష్మీ గణపతి ఆలయ సప్తమ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లోని లక్ష్మీ గణపతి దేవాలయం సప్తమ వార్షికోత్సవం ఘనంగా ముగిసింది. చివరి రోజు పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కమిటీ సభ్యులు శ్రీమన్నారాయణ, శ్యామ్‌సుందర్, రామచంద్రమూర్తి, భాస్కరరావు, వెంకటరమణ, రాధాకృష్ణ, భీమశంకర్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన పల్లవి మోడల్ స్కూల్



అల్వాల్ పల్లవి మోడల్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ కొమురయ్య, అధ్యాపకులు

అల్వాల్: సీబీఎస్ఈ ఫలితాల్లో అల్వాల్ పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. 12వ తరగతిలో మాస్టర్ రిషి శేఖర్ ఎంపీసీలో 99.2 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, మాస్టర్ ప్రణవ్ 98.6, మాస్టర్ పడాల సుహాస్ 98.4 శాతం బైపీసీలో మార్కులు సాధించారు. అదేవిధంగా 10వ తరగతిలో మాస్టర్ అభినవ్‌రెడ్డి 98.4, వెంకట నవదీప్ 98.2, మోహిత్ శుక్ల 97.6, గురు లిపిక 97.4, పుర్వాష రాయ్ 97.2 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ మల్కా కొమరయ్య, సీఓఓ మల్కా యశస్వి, ప్రిన్సిపల్ సునీల్‌నేగి, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

విజయ వినాయక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజల్లో ఈటల రాజేందర్, స్థానిక నాయకులు, భక్తులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడలో రెండు రోజులుగా జరుగుతున్న విజయ వినాయక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు లక్ష్మీనర్సింహస్వామి శాంతి కల్యాణం జరిగింది. కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చేయూత



కుమ్మరి రాజుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

మల్కాజిగిరి: ఛాతినొప్పితో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందిన పాత్రికేయుడు కుమ్మరి రాజుకు మల్కాజిగిరి ప్రెస్ క్లబ్(518) చేయూతనందించింది. బుధవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సేకరించిన ఆర్థిక సహాయాన్ని కుమ్మరి రాజుకు చెక్కు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, విశాల్‌యాదవ్, రహ్మాన్, సునీల్‌రెడ్డి, లవకుమార్, శివ, శ్రీకాంత్, మనోహర్, మహేందర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కిషోర్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న అయ్యప్ప భక్తులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడకు చెందిన కిషోర్‌చారి కిడ్నీ సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీధర్మ శాస్త్ర సేవా సమాజం, మల్కాజిగిరి అయ్యప్ప సేవా సంఘం, వినాయక్‌నగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు కిషోర్ చికిత్స నిమిత్తం రూ.26,062 నగదు అందజేశారు. గురుస్వామి అరవింద్‌రెడ్డి, కుమ్మరి రాజు, విగ్నేశ్వర్‌గౌడ్, మహమ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దాకా ఫోన్ మాట్లాడొద్దంటే.. పారిపోయాడు

తండ్రి మందలించాడని కొడుకు అదృశ్యం



దయానంద్

పోచారం: అర్ధరాత్రి దాకా ఫోన్ మాట్లాడొద్దని తండ్రి మందలించినందుకు కొడుకు ఇంటి నుంచి పారిపోయిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడలోని ఎల్ఎస్ కాలనీకి చెందిన మోరె దిలీప్(40)కు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు దయానంద్(22) ప్రతిరోజు అర్ధరాత్రి వరకూ ఫోన్‌లో మాట్లాడటాన్ని తండ్రి గమనించాడు. ఈ క్రమంలో అతడిని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన దయానంద్ మరునాడు తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం పోచారం పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆ రెండు.. అవిశ్వాసం మెండు!

- ఇప్పటికే మేడ్చల్ చైర్‌పర్సన్‌పై నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లు
- కాంగ్రెస్, బీజేపీల్లో చేరిన గుండ్లపోచంపల్లి బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- అవిశ్వాస గండం తప్పించుకునేందుకు చైర్‌పర్సన్ల భర్తల యత్నాలు
- ఎమ్మెల్యే మల్లారెడ్డి చోద్యం చూస్తున్నారని కార్యకర్తల అసంతృప్తి



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: కౌన్సిలర్ల వలసలతో మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న ఈ మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు. రెండు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్‌కు సంపూర్ణ బలం ఉన్నా ఇటీవల స్థానిక రాజకీయ పరిస్థితుల్లో మార్పుల కారణంగా బలహీనపడింది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్, బీజేపీలోకి జంప్ చేశారు. చైర్మన్లపై ఉన్న అసంతృప్తితో కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వలసలను నిరోధించడంలేదని కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఒకరు కుడిభుజం.. మరొకరు బావమరిది..

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక భర్త నర్సింహారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ భర్త శ్రీనివాస్‌రెడ్డిలు ఎమ్మెల్యే మల్లారెడ్డికి అత్యంత సన్నిహితులు. నర్సింహారెడ్డి ఎమ్మెల్యేకు కుడిభుజంగా ఉండగా, శ్రీనివాస్‌రెడ్డి వరుసకు బావమరిది. ఎమ్మెల్యే మొదటి నుంచి ఈ ఇద్దరికీ అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో రెండు మున్సిపాలిటీలలో కౌన్సిలర్లు, చైర్మన్ల మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. అయితే తాత్కాలికంగా తాయిలాలు ఇచ్చి ఎప్పటికప్పుడు సద్దుమణిగేలా చేసుకున్నారు. అయినా మేడ్చల్‌లో 11మంది కౌన్సిలర్లు అసమ్మతి బావుట ఎగురవేశారు. అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఒక్కటిగా కనిపించినా పార్లమెంట్ ఎన్నికలనాటికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మేడ్చల్ మున్సిపాలిటీలో ఏకంగా 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిపోయారు. కౌన్సిల్‌లో అప్పటికే ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. మొత్తం 16 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని వారం క్రితం కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు.

గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో...

గుండ్లపోచంపల్లి కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్‌లు శ్రీలత శ్రీనివాస్‌రెడ్డి, రాజకుమారి, అంతోనమ్మ కాంగ్రెస్‌లో చేరగా, మల్లికార్జున్ ముదిరాజ్, రజిత వెంకటేష్ ముదిరాజ్‌లు బీజేపీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ బలం కౌన్సిల్‌లో 12 నుంచి 6కు తగ్గగా, కాంగ్రెస్ బలం ఒకటి నుంచి 5 కు పెరిగింది. బీజేపీ బలం 2 నుంచి 4 కు పెరిగింది. బీజేపీ, కాంగ్రెస్ కలిసి చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ పదవి చేజారకుండా శ్రీనివాస్ రెడ్డి పావులు కదుపుతున్నారు. బీఆర్ఎస్‌కు మిగిలిన ఆరుగురు కౌన్సిలర్‌లతో రెండు రోజులలో దుబాయ్ ట్రిప్పు వెళుతున్నారు. తన వర్గం కౌన్సిలర్లు ఏమాత్రం జారిపోకుండా అన్ని శక్తులను ఒడ్డుతున్నారు.

వారు వద్దంటే.. వద్దు..

అవిశ్వాస గండం తప్పించుకునేందుకు మేడ్చల్, గండ్ల పోచంపల్లి మున్సిపాలిటీల చైర్‌పర్సన్‌ల భర్తలు నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే వారిని ఎట్టి పరిస్థితిలో కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఆయా మున్సిపాలిటీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నుంచి తాజాగా కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కోరారు. అయితే శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే మల్లారెడ్డి బావమరిది కావడంతో ఆయనను కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి కాంగ్రెస్ పెద్దలు కూడా అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు వ్యాక్సిన్లు సక్రమంగా వేయించాలి



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: 15 సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సిన్లను తల్లిదండ్రులు సంక్రమంగా వేయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో పల్లె దవాఖానాలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు ఇమ్యునైజేషన్ కోసం ప్రతి బుధవారం నిర్వహించే వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, పల్లె దవాఖానా డాక్టర్ పల్లవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఈటల గెలుపు ఖాయం’



హనుమాన్

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం ఖాయమని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ అన్నారు. ఘట్‌కేసర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టనున్నారని అన్నారు. దశాబ్దకాలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పారదర్శక పాలన, పేదలకు అందించిన సేవలు మూడోసారి విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో అలుపెరగకుండా శ్రమించిన నాయకులు, కార్యకర్తలతోపాటు ఓటర్లకు కతజ్ఞతలు తెలిపారు.

పాడైన ఆహార పదార్థాలతో ఐస్‌క్రీం తయారీ

వ్యాపారిపై కేసు నమోదు

పోచారం: పాడైన ఆహార పదార్థాలను వినియోగించి ఐస్‌క్రీంలు, ఇతర తినుబండారాలను తయారు చేస్తున్న ఓ వ్యాపారిపై పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు కొర్రెముల గ్రామంలోని ప్రతాపసింగారం క్రాస్ రోడ్ వద్ద ఐస్‌క్రీంలు, తినుబండారాలు తయారు చేస్తున్న కేంద్రాన్ని పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించి ఐస్‌క్రీంలు, ఇతర తినుబండారాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వ్యాపారం చేస్తున్న గిరీష్‌చంద్ర(53)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలతోపాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌లో రెచ్చిపోయిన దొంగలు

- తాళం వేసిన పలు ఇళ్లలో చోరీ
- సెలవులు, ఓటింగ్ కోసం స్వగ్రామాలకు వెళ్లినవారి ఇళ్లే దుండగుల టార్గెట్

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పట్టణంలో గత మంగళవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో పలు ఇళ్లలో నివాసం ఉండే ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలువురు వేసవి సెలవుల తోపాటు ఈ 13 న ఎన్నికల పోలింగ్ ఉండటంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు తరలివెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు చోరీలకు ప్లాన్ వేశారు. గత మంగళవారం అర్ధరాత్రి ఆర్టీసీ కాలనీలోని 5 ఇళ్లలో, ఓ కిరాణ షాప్‌లో తాళం పగులగొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనాస్థలాలకు వెళ్లిన పోలీసులు చోరీలు జరిగిన తీరు పరిశీలించారు. సీసీ కెమెరాలు, చోరీ ప్రదేశంలోని ఇతర ఆధారాలు సేకరించారు. కిరాణ దుకాణంలో రూ.15 వేల నగదు చోరీకి గురైనట్లు యజమాని ఫిర్యాదు చేయగా, మరో ఇంట్లో రూ.20 వేల నగదు, మిగతా ఇళ్లలో బంగారు ఆభరణాలతోపాటు నగదు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. కాగా, ఇంటి యజమానులు తమ సొంతూళ్ల నుంచి తిరిగి వస్తేగానీ పూర్తి వివరాలు తెలియవని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

పోచారం: పశువులను క్రూరంగా వేరే ప్రాంతాలకు తరలిస్తున్న ఓ వాహనాన్ని పోచారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం అన్నోజిగూడలోని డీమార్టు వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రంలో పశువులను క్రూరంగా తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపివేశారు. వాహనంతోపాటు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. శ్రీకాకుళం జిల్లా నారన్నపేట మండలంలోని తిలారా పశువుల సంత నుంచి నగరంలోని బహదూర్‌పురాకు పశువులను తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్ మైచర్ల మనీంద్ర (25) చెప్పాడు. వాహనంలో 13 మగ, 4 ఆడ దూడలు ఉన్నాయి. పోలీసులు జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జరగనున్నట్లు జెడ్పీ సీఈవో దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేసిన మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్త

కీసర: కీసర గ్రామానికి చెందిన మల్లిఖార్జున్ బుధవారం మృతి చెందడంతో అంత్యక్రియల కోసం మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్త రూ. 5 వేలు ఆర్థికసాయం చేశారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మల్లిఖార్జున్ ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు.

క్రమశిక్షణకు మారుపేరుగా జపాన్ విద్యార్థులు



జపాన్ విద్యార్థులతో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: జపాన్‌లో పరిపూర్ణమైన వ్యక్తిగా తయారయ్యేలా విద్యా విధానం కొనసాగడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారని ట్రస్మా రాష్ట్ర సలహాదారులు, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. జపాన్‌లో బ్రెయిన్ ఫీడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండో జపాన్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్, ఎడ్యుకేషన్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొని అక్కడి విద్యా విధానం గురించి తెలుసుకున్నారు. అనంతరం బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం జీవన నైపుణ్యాలు, సమగ్రత, విలువకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవడం, తమ పరిసరాలను వారే పరిశుభ్రం చేసుకోవడం, ఇంటి, వంట పనిలో చిన్నతనం నుంచే సహాయం చేస్తారన్నారు. స్థానిక స్వచ్ఛంద సంస్థలో సేవ చేయడం, శుభ్రపరిచే ప్రయత్నాల్లో పాల్గొనడం విద్యార్థులు బాధ్యతగా భావిస్తారన్నారు. టీమ్ ల్యాబ్ ప్లానెట్స్, టెక్నాలజీ ల్యాబ్, టెంపుల్స్, హెరిటేజ్ సెంటర్లు, యూనివర్సల్ స్టూడియో, టోక్యో, ఒసాకా నగరాలను సందర్శించి అక్కడ విద్యార్థుల జీవన విధానం గురించి తెలుసుకున్నట్లు వెల్లడించారు. రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమాపై అణుబాంబు దాడితో లక్ష మందికి పైగా మరణించారన్నారు. నేడు హిరోషిమా శాంతి, సయోధ్యకు చిహ్నంగా మారిందన్నారు. హిరోషిమా ఒక మిలియన్ కంటే ఎక్కువ జనాభా కలిగి ఆధునిక నగరంగా రూపుదిద్దుకుందని, అందమైన ఉద్యానవనాలు, చారిత్రిక దేవాలయాలు, ప్రసిద్ధమైన హిరోషిమా శైలితో ఒక ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత జయంతి వారోత్సవాలు



వాసవి మాత జయంతి వారోత్సవాల్లో నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

అల్వాల్: అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్ సూర్యనగర్‌లోని హేమదుర్గా దేవాలయం వద్ద ఆశీర్వాద నిలయంలో శ్రీవాసవి మాత జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం పూర్వ అధ్యక్షులు చందా నాగభూషణం, అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మంచాల రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి జగ్గయ్య, ఉపాధ్యక్షులు కోటగిరి వెంకటేశం, సూర్యనగర్ వాసవి సంఘం అధ్యక్షులు శ్రీహరి, భాస్కర్, సత్యనారాయణ, ఆనంద్‌బాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగానికి భారతి సిమెంట్ ఎంతో మేలైంది



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న సాత్విక్‌రెడ్డి

బోడుప్పల్: భవన నిర్మాణానికి భారతి సిమెంట్ ఎంతో మేలైందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ ద్వారకానగర్‌లో బుధవారం డీలర్ షాపులో నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతుందని, భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసినట్లు వెల్లడించారు. మార్కెట్‌లో లభించే సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక న్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లను 30 మందికి అందజేశారు.

అల్వాల్‌లో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన షురూ

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీసాయిగార్డెన్ ఫంక్షన్‌హాలులో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళా సిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ మాట్లాడుతూ.. చేనేత కళాకారులని ప్రోత్సహించే లక్ష్యంగా ఈ ప్రదర్శనను ప్రారంభించామన్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే వస్త్రాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు. వచ్చేనెల 3వ తేదీ వరకు, ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తామని, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంటల సాగు.. ప్రణాళిక ఖరారు



- జిల్లాలో వానాకాలం విస్తీర్ణం 28,115 ఎకరాలు
- ఇందులో ఉద్యానపంటల సాగు 6,485 ఎకరాలు
- విత్తనాలు, ఎరువులు, రుణాలపై వ్యవసాయశాఖ చర్యలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: లాభసాటి పంటలను దృష్టిలో పెట్టుకుని పంటమార్పిడికి అనుగుణంగా వానాకాలం పంటసాగుపై జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళిక ఖరారు చేసింది. పంటలసాగుకు సరిపడా విత్తనాలు, ఫర్టిలైజర్, పంటరుణాల పంపిణీపై కసరత్తు చేస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 28,115 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో 6,485 ఎకరాల్లో ఉద్యానపంటలు సాగయ్యేలా చర్యలు చేపట్టింది. పంట పెట్టుబడి కింద ప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్న రైతుబంధు పథకానికి సంబంధించి రైతుల ఖాతాల్లోకి జూన్‌కల్లా డబ్బులు జమయ్యేలా కసరత్తు జరుగుతోందని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వానాకాలంలో జిల్లాలో 33,848 మంది రైతులకు ఈ పథకం కింద ప్రతీ ఏటా రూ.33.03 కోట్లను ప్రభుత్వం అందిస్తోంది.

సాగు ప్రణాళిక ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వానాకాలం పంట సాగు విస్తీర్ణం 28,115 ఎకరాలు కాగా, ఇందులో 6,485 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేలా వ్యవసాయ, ఉద్యానశాఖలు చర్యలు తీసుకుంటోంది. వరి 18,900 ఎకరాలు కాగా, పత్తి పంట 130 ఎకరాలుగా నిర్ణయించారు. జొన్న 25 ఎకరాలు, పప్పుధాన్యాల పంటలు 75 ఎకరాలు, సీడ్ కోసం మొక్కజొన్న 250 ఎకరాలు, మిగిలిన ఏరియాల్లో పశుగ్రాసం 2,250 ఎకరాల్లో సాగు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఉద్యాన పంట సాగులో భాగంగా 4,170 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటల పంటలు, 1,820 ఎకరాల్లో కూరగాయలు, తీగజాతి ఆకుతోట పంటలు, మిగతా ఏరియాల్లో పూలతోటలు సాగయ్యేలా దిశానిర్దేశం చేశారు. ఆహారయేతర పంటల సాగు(పూలు, ఔషధ మొక్కలు తదితరాలు) 495 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించారు. వానాకాలం పంట సాగుకు అనుగుణంగా వివిధ రకాల విత్తనాలు 4,765.45 క్వింటాళ్ల రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరీ రేఖ పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు వానాకాలంలో 6,375 మెట్రిక్ టన్నుల ఎరువులు, ఫర్టిలైజర్ అవసరం కాగా, దీనికి మించి 2,194 మెట్రిక్ టన్నుల యూరియా, 2,345 మెట్రిక్ టన్నుల డీఏపీ, 827 మెట్రిక్ టన్నుల ఎంవోసీ, 165 మెట్రిక్ టన్నుల ఎస్ఏఎస్, 29,327 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచారు. ఈ ఎరువులు సొసైటీల ద్వారా రైతులకు విక్రయించేలా జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది.
- జిల్లాలో 6,522 మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.48 కోట్ల పంట రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించటంతోపాటు అందుకు అనుగుణంగా వ్యసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఆగస్టులో రైతులకు రుణమాఫీపై వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. మార్గదర్శకాలు విడుదల కాగానే.. తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు సమాయత్తమవుతోంది.